కార్తీక పూజలకు వేళాయె

- ముస్తాబైన శైవ క్షేత్రాలు
- నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు


లలితా సుందరేశ్వర పీఠంలో శివాలయం


పన్నెండోవార్డు పెదగదిలిలో శివాలయం ముందు భక్తులు కోసం వేసిన టెంట్లు


తొమ్మిదోవార్డు విశాలాక్షినగర్‌లో ముస్తాబవుతున్న శివాలయం


భస్మాభిషేకం


పెదవాల్తేరు శివాలయం


శివాజీనగర్-శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: కార్తీక మాసం శివ పూజలకు తూర్పు నియోజకవర్గంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నీడ కోసం టెంట్లు వేశారు. పలు ఆలయాలకు పెయింటింగ్‌లు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. విద్యుద్దీపాలతో అలంకరించారు. జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లోని కైలాసగిరీశ్వర ఆలయం, హనుమంతవాక శివాలయం, 10వ వార్డు ఆదర్శనగర్, రవీంద్రనగర్‌లో శివాలయాలు, 11వ వార్డు కైలాసనగర్, డ్రైవర్స్ కాలనీల్లోని శివాలయాలు, 12వ వార్డు పెదగదిలి, నెహ్రూనగర్‌లో శివాలయాలు, 13వ వార్డు పరిధి ఆపరేషన్ కాలనీ, శివాజీనగర్-2లోని శివాలయాలతో పాటు ఎంవీపీ కాలనీ, అప్పూఘర్, జాలరిపేట, పెదవాల్తేరు, చినవాల్తేరు, ఇసుకతోట, పిఠాపురం కాలనీ, మద్దిపాలెం, వెంకోజీపాలెం, హెచ్‌బీ కాలనీల్లో శివాలయాలు ప్రత్యేక పూజల కోసం సిద్ధమయ్యాయి. సోమవారం కార్తీక మాసం మొదటి రోజు అయినప్పటికీ మధ్యాహ్నం వరకు అమావాస్య ఉండటంతో తెల్లవారుజామున ఆలయాల వద్ద భక్తుల సందడి కనిపించ లేదు. సాయంత్రం కార్తీకం రావడంతో పలు ఆలయాల వద్ద భక్తులు సందడి కనిపించింది. శివుడిని దర్శించుకుని పూజలు చేశారు.

ఏయూ క్యాంపస్: పవిత్ర కార్తీక మాసం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ప్రత్యేక పూజల కోసం శైవ క్షేత్రాల వద్ద ఏర్పాట్లు చేశారు. ఈ సంవత్సరం కార్తీక మాసంలో నాలుగు సోమవారాలు రానున్నాయి. సోమవారం, కార్తీక పౌర్ణమి రోజుల్లో భారీగా భక్తులు హాజరవుతారు. ప్రతి రోజు ఆలయాలలో ఆకాశదీపం వెలిగిస్తారు. నవంబర్ 20, 27, డిసెంబర్ 1, 11 తేదీల్లో కార్తీక సోమవారాలను పురస్కరించుకుని ఆలయాలలో రుద్రాభిషేకాలు నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

క్లుప్తంగా

అయ్యప్ప స్వాముల సేవలో వంశీకృష్ణ


పీఠంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

సీతంపేట: ఎరుమేలి అయ్యప్ప అన్నసమారాధన ట్రస్టు ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు ఆస్పత్రి సమీపంలో స్వాములకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ట్రస్టు సభ్యులు ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ముందుగా పీఠంలో అయ్యప్ప స్వామి చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం స్వాములకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వంశీకృష్ణ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవని, దీక్షలో ఉన్న స్వాములకు సేవ చేయడం గొప్ప వరంగా భావిస్తున్నానన్నారు.

ప్రజా రక్షణ భేరి విజయవంతానికి పిలుపు


ప్రజా రక్షణ భేరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం : ప్రజా సమస్యలపై ఈ నెల 15న విజయవాడలో తలపెట్టిన ప్రజా రక్షణ భేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పిఠాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రధాని మోదీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి ఈ ప్రజా రక్షణ భేరిని తలపెట్టామన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్‌లు, ఎస్.పుణ్యవతి, రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు పాల్గొంటారని, అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

26న యదు మేళా


పోస్టర్ ఆవిష్కరిస్తున్న యాదవ సంఘం నాయకులు

బీచ్ రోడ్డు: కార్తీక్ పౌర్ణమి పురస్కరించుకుని పాలు, పెరుగు యదుమేళా ఉత్సవాన్ని ఈ నెల 26న గోకుల్ పార్క్ వద్ద నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవం పోస్టర్‌ను విశాఖ జిల్లా యాదవ్ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం బీచ్‌రోడ్డులోని గోకుల పార్క్‌లో ఆవిష్కరించారు. ఆ రోజు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఆ రోజు యాదవ సామాజిక వర్గం ప్రముఖులతో సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బి.రామారావు, జి.రవికుమార్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

వీజేఎఫ్ సభ్యత్వ రెన్యువల్ గడువు పొడిగింపు

అల్లిపురం: వైజాగ్ జర్నలిస్ట్స్ ఫోరం (వీజేఎఫ్) సభ్యత్వ రెన్యువల్ గడువు కలెక్టర్ మల్లికార్జు ఆదేశాల మేరకు మరో మూడు రోజులు పొడిగిస్తున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు 430 మంది సభ్యులు రెన్యువల్ చేసుకున్నారని తెలిపారు. మిగిలిన వారు రెన్యువల్ దరఖాస్తును వెంటనే సమర్పించాలని కోరారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం


13వ వార్డులో ఐక్య సంఘాల సమావేశంలో పాల్గొన్న గ్రామ సంఘాల ప్రతినిధులు

ఆరిలోవ: ఐక్యతతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని ఐక్య సంఘాల అధ్యక్షుడు పిల్లి వీర్రాజు అన్నారు. జీవీఎంసీ 13వ వార్డులోని కాలనీల సమస్యలపై ఐక్య సంఘాల సమావేశం ఆదివారం జరిగింది. ఈ వార్డులో 26 సంఘాలున్నాయి. వాటిలో 20 సంఘాల అధ్యక్షులు ఈ సమావేశంలో పాల్గొని సమస్యలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఐక్య సంఘాల అధ్యక్షుడు పిల్లి వీర్రాజు మాట్లాడుతూ 13వ వార్డులోని కాలనీల్లో ఉన్న సమస్యలు గుర్తించామన్నారు. జీవీఎంసీ కల్యాణ మండపాన్ని, జైభీమ్ నగర్‌లో నిర్మించిన దుకాణ సముదాయాన్ని చిరు వ్యాపారులకు కేటాయించి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. యూపీహెచ్‌సీలో వైద్య సేవలు 24 గంటలు అందుబాటులో ఉండాలని, శ్మశానవాటిక పరిసరాలను శుభ్రం చేయించాలని, శివాజీనగర్‌ను ఆనుకొని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన రేతాత్కాలిక షెడ్‌లు తొలగించాలని, క్రీడా మైదానం పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు సమస్యలపై తయారు చేసిన నివేదికను వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ అధికారులు, మేయర్‌కు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయా సమస్యలపై అధికారులు దృష్టి పెట్టి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘాల అధ్యక్షులు కె.శిరీష, బేతా దుర్గారావు, బత్తిన వెంకట్, అడ్డూరి వెంకటరమణ, బానోజీరావు, సన్యాసిరావు, రాంబాబు, అప్పన్న, శ్రీను, వెంకటేశ్వర్లు, మాధవ సాహు పాల్గొన్నారు.

నేడు గరికిపాటికి సాహిత్య కళాభారతి పురస్కారం

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ గరికిపాటి నరసింహారావుకు సాహిత్య కళాభారతి పురస్కారంతో సత్కరించనున్నామని వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.రాజు, డాక్టర్. గుమ్ములూరి రాంబాబు తెలిపారు. పురస్కారంతో పాటు, నాలుగు రోజుల పాటు నిర్వహించే ఆకాశదీపం- కాశీఖండం ప్రవచన కార్యక్రమాలకు సంబంధించి వివరాలను సోమవారం మీడియాకు వివరించారు. ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం చేతులు మీదుగా మంగళవారం డాక్టర్.గరికిపాటి నరసింహారావుకు సాహిత్య కళాభారతి పురస్కారంతో సత్కరించనున్నారని తెలిపారు. అనంతరం బుధవారం నుంచి 17వ తేదీ వరకు రోజూ సాయంత్రం 5.30 గంటల నుంచి ఆకాశదీపం- కాశీఖండం ప్రవచనాలను డాక్టర్ గరికిపాటి నరసింహారావు ప్రవచించనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా స్టడీస్ పూర్వ విభాగాధిపతి డాక్టర్.పి.ఇందిర పాల్గొంటారన్నారు. వీఎండీఏ ప్రతినిధి పైడా క్రిష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

నేడు డయల్ యువర్ డీఎం

సింహాచలం: ప్రయాణికుల సౌకర్యార్థం సలహాలు, సూచనలు స్వీకరించడానికి మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ సింహాచలం డిపో మేనేజర్ కె. రాజశేఖర్ తెలిపారు. 9959225592, 7382825592 నంబర్లకు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం


గుల్షాన్

డాబాగార్డెన్స్: స్నేహితుడి ఇంటికి వెళ్లి వస్తానని దీపావళి రోజున వెళ్లిన ఓ యువకుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన వివరాలివి. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి టౌన్‌కొత్తరోడ్డు దరి లక్ష్మీశ్రీ నిలయంలో స్థానికంగా ఉంటున్న ఎస్.గుల్షాన్ ఓ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. దీపావళి పండగ రోజున స్నేహితుడి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పిన గుల్షాన్ తిరిగి ఇంటికి రాలేదు. తన వద్ద ఉన్న మొబైల్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. గుల్షాన్ వద్ద రూ.500 మాత్రమే ఉన్నాయని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తండ్రి హైదరాబాద్‌లోని లాజిస్టిక్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసుల దృష్టికి తీసుకురావాలని సీఐ కోరారు.

ఘనంగా దీపావళి వేడుకలు


బాణసంచా కాల్చుతున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ కుటుంబ సభ్యులు


భీమ్‌నగర్ వసతి గృహంలో స్వచ్ఛ దీపావళి వేడుకల్లో నిరాశ్రయులు

బీచ్ రోడ్డు: దీపావళి వేడుకలను నగరవాసులు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలోని ప్రతి ఇంటా కొత్త వెలుగులు విరజిల్లాలని ఆకాంక్షించారు.

నిరాశ్రయ వసతి గృహాల్లో..

అల్లిపురం: జీవీఎంసీ ఏయూటీడీ వసతి గృహాల్లో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీఎస్ఆర్ కాంప్లెక్స్, భీమ్‌నగర్ ప్రాంతాల్లోని నిరాశ్రయ వసతి గృహాల్లో నిరాశ్రయులు స్వచ్ఛ దీపావళి జరుపుకున్నారు.

టపాసులకు దూరంగా ఉండి ప్రమిదలు వెలిగించి పండగ చేసుకున్నారు. వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి వారితో కలిసి వేడుకలు నిర్వహించారు.

భైరవకోనకు పోటెత్తిన భక్తులు


భైరవస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

సింహాచలం: అమవాస్య పురస్కరించుకుని సోమవారం భైరవవాకలోని భైరవస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయనికి వెళ్లే రెండు కిలోమీటర్ల అటవీమార్గం భక్తులతో కిక్కిరిసింది. తెల్లవారుజాము రెండు గంటల నుంచి నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకున్నారు. స్వామికి అభిషేకాలు నిర్వహించారు. విభూదితో అర్చన చేశారు.అమృత కలశాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా దీపాలతో నిండిపోయింది.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

క్రైం ఏసీపీ వెంకటరావు


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈస్ట్ ఏసీపీ వెంకటరావు తదితరులు

అల్లిపురం: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని క్రైం ఏసీపీ ఎ.వెంకటరావు అన్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు, క్రైం డీసీపీ గంధం నాగన్న సూచనలతో ఆయన టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొబ్బరితోటలో సోమవారం సాయంత్రం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆధునిక సాంకేతికతతో సీసీ కెమెరాలు అందుబాటులోకి వస్తున్నాయని, వీటిని ప్రతీ వీధిలో ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేర రహిత సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు లోను కావద్దన్నారు. అలా ఎవరైనా మోసానికి గురైతే 100, టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఈస్ట్ క్రైం సీఐ చక్రధరరావు, టూటౌన్ క్రైం ఎస్ఐ కే.శ్రీను, ఏఎస్ఐ అప్పారావు, హెచ్‌సీ హఫీజ్, అర్జున్ పాల్గొన్నారు.

26న రాజ్యాంగ దినోత్సవ సదస్సు

సీతంపేట: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 26న బుల్లయ్య కళాశాల వద్ద గల అంబేడ్కర్ భవన్‌లో సదస్సు నిర్వహించనున్నట్టు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు కల్యాణరావు, జె.వి.ప్రభాకర్ తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను సోమవారం అంబేడ్కర్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమానత్వం, సాధికారతపై సంకల్పం లేని అనే అంశంపై ఉదయం 10 గంటల నుంచి సదస్సు జరుగుతుందన్నారు. సదస్సుకు ముందు డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం నుంచి అంబేడ్కర్ భవన్ వరకు బైక్ ర్యాలీ చేస్తున్నామన్నారు. దళిత బహుజనులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

భక్తిశ్రద్ధలతో నృసింహ హోమం

సింహాచలం: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై ఆదివారం నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజు సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉదయం 7 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో హోమం నిర్వహించారు. ఆన్‌లైన్ ద్వారా తొలిసారి టికెట్లు అందుబాటులో ఉంచడంతో 50 మంది దంపతులు హోమంలో పాల్గొని తరించారు. తొలుత చక్రపెరుమాళ్లను ఆలయంలోంచి ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చి హోమగుండం వద్ద అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమాన్ని విశేషంగా నిర్వహించారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలతో స్వామివారి అష్టోత్తరనామావళి పఠింపజేశారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ చేశారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు పాల్గొన్నారు.

డయాబెటిక్ రెటినోపతి పరీక్షలు నేడు

మద్దిలపాలెం : సీఎంఆర్ సెంట్రల్‌లో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 నుంచి రాత్రి 7 గంటల వరకూ ఉచిత డయాబెటిక్ రెటినోపతి పరీక్షలు నిర్వహించనున్నామని ఆస్పత్రి ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో 30 ఏళ్ల పైబడిన వారందరికి పరీక్షలు చేస్తామన్నారు. మధుమేహం బాధితులకు ఏమైనా కంటి చూపునకు సంబంధించి సమస్యలున్నాయో గుర్తించి సలహాలు ఇవ్వనున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆహారపు అలవాట్లు మార్పుతో మధుమేహం నియంత్రణ

బీచ్ రోడ్డు: ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న వ్యాధుల్లో మధుమేహం ఒకటని, అందులో ప్రీ డయాబెటిక్ అనేది జీవన శైలీలో మార్పు, పోష్టకాహారం లోపం వల్ల వచ్చే అవకాశం ఉందని ప్రముఖ వైద్య నిపుణుడు యాస్మిన్ అన్నారు. ప్రపంచ మధుమేహం దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బీచ్ రోడ్డులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు పరిశోధనల ప్రకారం దేశంలో కోటి మంది వరకు ప్రి డయాబెటిక్‌తో బాధపడుతున్నట్లు తేలిందన్నారు. ఆహారపు అలవాట్లు మార్పుతో వారు మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చునని చెప్పారు. ముఖ్యంగా బ్లడ్ షుగర్ స్థాయిని నియంత్రించే బాదం, జామ పండ్లు ప్రతి రోజు తప్పకుండా తీసుకోవాలన్నారు. రోజూ గంట పాటు వ్యాయామం చేస్తే మధుమేహం నియంత్రణలోకి వస్తుందన్నారు. మధుమేహం పెరగడానికి గల కారణలపై అవగాహన పెంచుకోవడం వల్ల కూడా ఫలితం ఉంటుందని చెప్పారు.

ఏయూ సమాచారం..

ఎంఎల్‌ఆర్ విభాగంలో ముగిసిన శిక్షణ


ప్రత్యక్ష శిక్షణ పొందుతున్న పరిశోధకులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్(ఎంఎల్ఆర్) విభాగంలో మైక్రో ప్లాస్టిక్స్‌పై నిర్వహిస్తున్న మూడు రోజుల వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ఏయూ ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్ర కాలుష్యం, ప్లాస్టిక్ ఫలితంగా ఏర్పడుతున్న దుష్పరిణామాలను వివరించారు. సముద్ర జీవులు, మానవ మనుగడకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్లాస్టిక్ కారణమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూరోపియన్ కమిషన్ ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ఆచార్య పి.జానకీరామ్, డాక్టర్ కె.ఉమాదేవి, ఆచార్య ఆర్.మాధవి, ఆచార్య కె.వి.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

టిఫిన్ షాప్‌లో చెలరేగిన మంటలు


టిఫిన్ షాప్‌లో ఎగసిపడుతున్న మంటలు

మురళీనగర్/మర్రిపాలెం: మురళీనగర్ మెయిన్ రోడ్డు సాయి కాంప్లెక్స్‌లోని డీఎఫ్‌సీని ఆనుకుని ఉన్న మిల్లెట్ టిఫిన్ సెంటర్‌లో సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. షాప్ వంట గది నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగలతో మంటలు చెలరేగాయి. మంటలు ఎక్కువ కావడంతో స్థానికులు బర్మా క్యాంప్‌లోని మర్రిపాలెం అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేసి సమాచారం అందించారు. జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి కె.వి.పి.ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. టిఫిన్ షాప్ నిర్వాహకుడు బి.అశ్వనీకుమార్ నుంచి అధికారులు వివరాలు సేకరించారు. ఈ ప్రమాదంలో ఫ్రీజర్, గ్యాస్ స్టవ్, ఏసీ, గ్రైండర్, వంట సామగ్రి కాలిపోయాయి. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని, రూ.లక్షా 50 వేల నష్టం సంభవించినట్లు ఏడీఎఫ్‌వో ప్రసాదరావు తెలిపారు. కంచరపాలెం ఐదో పట్టణ సీఐ ఎన్.సాయి ప్రమాద ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

'ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం నేర్పుతాం'


1005వ రోజు ఉక్కు దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల నిరవధిక ఉద్యమంతో కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెపుతామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వరంగ సంస్థల జోలికి వెళ్లకుండా ఉండేలా గుణపాఠం నేర్పుతామన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న నిరాహారదీక్షలు సోమవారం నాటికి 1005వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన సీవో మరియు సీపీపీ విభాగ కార్మికులు పాల్గొని, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటువారికి అప్పగించాలన్న లక్ష్యానికి ఎదురు తిరిగిన కార్మిక వర్గానికి దెబ్బ కొట్టాలని కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చూస్తోందన్నారు. ఇందుకు అనుగుణంగా దొడ్డిదారిన స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి ఉక్కు యాజమాన్యంతో కలిసి విద్రోహ చర్యలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్థలో ప్రధాన విభాగాలను పాక్షికంగా నిలిపివేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఉక్కు నిర్వాసితులు ఇప్పటికీ శాశ్వత ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు ఉద్యమ సెగ దేశవ్యాప్తంగా వెళ్లిందన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణకు సీపీఎం ఆధ్వర్యంలో నవంబర్ 15వ తేదీన విజయవాడలో నిర్వహిస్తున్న ప్రజారక్షణ భేరి కార్యక్రమానికి మంగళవారం ఉదయం 7 గంటలకు దీక్షా శిబిరం నుంచి సుమారు 200 మంది కార్మికులు బైక్ ర్యాలీ ద్వారా విజయ వాడ చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.